విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

బుధవారం 07 మే 2025 8 పేజీలు

పొగాకు రైతు కంట కన్నీరు

- గిట్టుబాటు ధరలేక రోడ్డెక్కిన వైనం
- నాగులుప్పలపాడు హైవేలో పొగాకు బేళ్లు తగలబెట్టి నిరసన
- వ్యాపారుల సిండికేట్‌తో అల్లాడుతున్న రైతులు
- క్వింటాకు రూ.35 వేలు ధర ఇస్తేనే న్యాయం
- ప్రస్తుత ధర రూ.25 వేలు మాత్రమే

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : పొగాకు రైతులకు గిట్టుబాటు ధరలు రాకపోవడంతో వారి కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. వ్యాపారుల మాయాజాలంతో రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక మంగళవారం నాగులుప్పలపాడులోని ఒంగోలు-చీరాల రహదారిపై పొగాకు బేళ్లు తగలబెట్టి తమ నిరసన వ్యక్తం చేశారు. జిల్లాలో పొగాకు ధరల కోసం గత కొంతకాలంగా రైతులు ఆందోళన చేస్తున్న విషయం విధితమే. రాష్ట్ర వ్యాప్తంగా పండే పొగాకు పంటలో 80 శాతం ఒక్క ప్రకాశం జిల్లాలోనే ఉత్పత్తి జరుగుతుంది. అయితే మారిన వ్యవసాయ పనుల విధానంలో పెరిగిన ఖర్చులకనుగుణంగా రైతులకు క్వింటాకు రూ.33వేల నుంచి 35 వేల వరకు పలికితే రైతుకు గిట్టుబాటు అవుతుంది. ప్రస్తుతం క్వింటా పొగాకు 25 వేలు మాత్రమే పలుకుతుంది. దీని వెనుక వ్యాపారులు బోర్డు అధికారులతో కుమ్మక్కై ధరలు పెరగకుండా అడ్డుకుంటున్నారు. దీంతో చేసేదేమీలేక రైతులు పండించిన పొగాకును అమ్మలేక ఉంచుకోలేక ఆగ్రహంతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మరికొంతమంది రైతులయితే ధరలు లేకపోవడంతో ఆవేదనతో తాము పండించిన పంటను కళ్లముందే తగలబెడుతూ ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేస్తున్నారు. గత వారంలో జిల్లాకు చెందిన మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి, సంతనూతలపాడు శాసనసభ్యులు బీఎన్ విజయ్‌కుమార్ మరికొంతమంది అధికార పార్టీకి చెందిన నేతలు వేలం కేంద్రాలను పరిశీలించి గిట్టుబాటు ధరలు కల్పిస్తామని చెప్పారు. అయినా ధరలలో ఎలాంటి మార్పు కనపడలేదు. ఆ నేపథ్యంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బారెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, వైసీపీ జిల్లా అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ వెంకాయమ్మ ఆ పార్టీకి చెందిన నాయకులతో పాటు ఏపీ రైతు సంఘం ప్రతినిధులు వేలం కేంద్రాన్ని పరిశీలించిరైతులకు మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయినప్పటికీ రైతులకు గిట్టుబాటు ధర పలకడం లేదు. ఈ నేపథ్యంలో మంగళవారం నాగులుప్పలపాడు మండలానికి చెందిన రైతులు పొగాకు బేళ్లను దగ్ధం చేసి నిరసన మిగతా 2 లో ...

మనం ప్రజా సేవకులం

- ప్రజల క్షేమం కోసం పని చేయాలి
- ఎమ్మెల్యే అయినా, కార్పొరేటర్ అయినా ప్రజలకు బావాబిదారిగా ఉండాలి
- కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలి
- నిర్ణీత గడువులో పనులు ప్రారంభించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టండి
- చెత్త పన్నులు వసూలు చేస్తే కఠిన చర్యలు
- నగరంలో పారిశుద్ధ్యం మెరుగుపడాలి
- గుండ్లకమ్మ పైప్ లైన్ పనులు పూర్తి చేస్తాం
- ఒంగోలులో ప్రతీ రోజు అందుబాటులో తాగునీరు
- ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు
- ఒంగోలు మున్సిపల్ కౌన్సిల్‌లో 124 అంశాలు ఆమోదం

– విశాలాంధ్ర, ఒంగోలు

7లో

కంపెనీల మెడలు వంచైనా

పొగాకు కొనుగోలు చేస్తాం

- నష్టానికి అమ్ముకోవాల్సిన అవసరం లేదు
- రైతు ప్రయోజనాలు దెబ్బ తింటే చూస్తూ ఊరుకోము
- బర్లి పొగాకు రైతాంగానికి ఎమ్మెల్యే ఏలూరి భరోసా
- రైతులకు అండగా ఉంటాం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్
- పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటాం
- వ్యవసాయ కమిషనర్ ఢిల్లీ రావు

విశాలాంధ్ర – పర్చూరు : రైతాంగం ధైర్యంగా ఉండండి, ఇది రైతు ప్రభుత్వం.. రైతు ప్రయోజనాలే మాకు ముఖ్యం రైతులు ఇబ్బంది పడుతుంటే చూస్తూ ఊరుకోం, రైతులందరికీ అండగా ఉంటామని కంపెనీల మెడలు వంచైనా ప్రతి రైతు వద్ద బర్లి పొగాకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకునే బాధ్యత ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతులకు భరోసా ఇచ్చారు. బర్లి పొగాకు కొనుగోలు లేక రైతాంగం ఇబ్బందులు పడుతున్న పరిస్థితుల్లో నేపథ్యంలో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రి అచ్చెన్నాయుడికి సమస్య తీవ్రతను వివరించారు. ఆ దశగా ప్రభుత్వం యంత్రాంగంలో కదిలికొచ్చింది నేరుగా రైతుల వద్దకే ప్రభుత్వం వచ్చేలా ఎమ్మెల్యే ఏలూరి కృషి చేశారు. దీనిలో భాగంగా మంగళవారం మిగతా 2 లో ...

ఆగస్టులో సీపీఐ రాష్ట్ర మహాసభలు

ఎంఎల్ నారాయణ

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : సీపీఐ రాష్ట్ర 28వ మహాసభలు ఆగస్టు 20 నుండి 24 వరకు ఒంగోలులో జరగనున్నాయి. ఈ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం యర్రగొండపాలెంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ యర్రగొండపాలెం మండల మహాసభ నిర్వహించారు. ఈ సభకు సీపీఐ మండల కార్యదర్శి నక్కా తిరుపతయ్య అధ్యక్షత వహించారు. ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ ఇండియా పాకిస్తాన్‌కు మరో రెండు రోజులలో యుద్ధం ప్రారంభమవుతుంది. ఈ యుద్ధంలో ఎవరు మరణిస్తారో తెలియదు. దేశానికి తీవ్రమైన నష్టం జరుగుతుందని అన్నారు. ఈ నష్టాన్ని పూడ్చుకోవడానికి కొంత సమయం పడుతుందని ఆర్థిక శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారని అన్నారు. భారతదేశానికి పాకిస్తాన్‌కు యుద్ధం జరిగితే పాకిస్తాన్ మరో వంద సంవత్సరాలు అభివృద్ధి వెనక్కి వెళ్తుందని ఉన్నారు. యుద్ధం అనివార్యమైతే తప్ప యుద్ధానికి వెళ్ళటం అంత మంచిది కాదని, యుద్ధం వల్ల దేశం ఆర్థికంగా దివాలా తీస్తుంది. దేశంలోని ప్రజలు, సైన్యం నష్టపోతుంది. యుద్ధాన్ని ఆపడానికి ప్రయత్నం చేయండి సీపీఐ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేస్తుందన్నారు. అటవీ ప్రాంతంలో ఉన్న ఖనిజ సంపదను దేశంలో ఉండే బడా కార్పొరేట్ సంస్థలు, ఆదాని అంబానీ లాంటివారికి, ప్రపంచ కార్పొరేట్ కంపెనీలకు దోచిపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని ఆయన వివరించారు. భారతదేశంలో వామపక్ష పార్టీలు అందరు కోరేది మీరు మావోయిస్టు పార్టీని అంతం చేస్తామనే పేరుతోటి ఆదివాసులు గిరిజనుల మీద దాడి చేసి కాల్చి చంపడం సరైన పద్ధతి కాదని అన్నారు. కాల్పులు ఉపసంహరించండి ఆదివాసులతో మావోయిస్టులతో చర్చలు జరపండి తద్వారా భారతదేశంలో శాంతిని నెలకొల్పండి అడవి ప్రాంతంలో మిగతా 2 లో ...

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

మంత్రి డోలా వీరాంజనేయ స్వామి

2లో

గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తున్న కూటమి ప్రభుత్వం

వరికూటి అశోక్ బాబు

6లో

నమ్మకమే విజయానికి తొలి మెట్టు

- బలహీనులు బలవంతులకు సాయం అందించండి
- నావంతుగా ఐదు ఎస్టీ కుటుంబాలు దత్తత
- మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి

8లో

18.2 మి.మీల వర్షపాతం నమోదు

విశాలాంధ్ర - ఒంగోలు టౌన్: జిల్లాలో పలు ప్రాంతాలలో మంగళవారం 18.2 మి.మీల వర్షపాతం నమోదు అయినట్లు అధికారులు తెలిపారు. అందులో యర్రగొండ పాలెంలో 10.2 మి.మీలు , కొనకల మిట్లలో 7.0, మార్కాపురం 1.0 మి.మీల మేర నమోదు అయినట్లు అధికారులు తెలిపారు.

తాగునీటి సమస్య రాకుండా చూడాలి

మంత్రి డోలా వీరాంజనేయ స్వామి

విశాలాంధ్ర-కొండపి : వేసవి దృష్ట్యా అధికారులు తగిన జాగ్రత్త చర్యలు తీసుకొని నియోజకవర్గంలోని ప్రజలకు మంచినీటి సమస్య రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి సూచించారు. మంత్రి స్వామి మంగళవారం వివిధ శాఖల అధికారులతో క్యాంపు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు . గ్రామాల్లో పచ్చదనం పరిశుభ్రతను పాటించాలన్నారు. అధికారులు ప్రజలకు జవాబు తరితనంగా పనిచేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది సమయంలోనే పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకెళుతుందన్నారు. నీటి సరఫరా, విద్యుత్తు, సిసి రోడ్లు, పారిశుద్ధ్యం అంశాల మీద అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వేసవి దృష్ట్యా ప్రజలకు మంచినీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సంబంధిత అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొడదాం

ఏఐటీయూసీ నియోజకవర్గ కన్వీనర్ కోన శ్రీను

విశాలాంధ్ర - రేపల్లె : కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని రేపల్లె నియోజకవర్గం ఏఐటీయూసీ రేపల్లె నియోజకవర్గ ఏఐటియుసి కన్వీనర్ కోన శీను కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు, పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మంగళవారం పట్టణంలోని మున్సిపల్ కార్మికులతో కలసి సార్వత్రిక సమ్మెకు సిద్ధమవుతున్నట్లు మున్సిపల్ కార్మికులు హెచ్చరించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీలో పనిచేయుచున్న ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ మహిళా ఉద్యోగులకు సంబంధించి సాధారణ సెలవులు జీవో నెంబర్ 39 ఉందన్నారు. ఈ జీవో ప్రకారం మహిళా ఉద్యోగులకు వారికున్న 15 రోజులు సాధారణ సెలవులు కాకుండా ఇంకా అదనంగా 5 రోజులు సాధారణ సెలవులు తీసుకొనడానికి అవకాశం ఉందని తెలిపారు. 20వ తేదీన జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును రేపల్లె మున్సిపల్ కమిషనర్ సాంబశివరావుకి జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ పడమటి బిక్షాలు, కోన శ్రీను, సింగం వాణిశ్రీ, కార్మికులతో కలిసి అందజేశారు. రేపల్లె మున్సిపల్ పరిధిలోని వర్కర్స్ అందరూ సమ్మెకు హాజరవటం జరుగుతుం దని కోన శీను తెలిపారు. బాపట్ల జిల్లా ఏఐటీయూసీ కౌన్సిల్ సభ్యులు,అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ బాపట్ల జిల్లా కన్వీనర్ సింగం వాణిశ్రీ,మున్సిపల్ కార్మికులు భూపతి రాజేశ్వరి, రమాదేవి, మేలికా కుమారి, అనూరాధ, ఏసుబాబు, నారాయణ, ముఖర్జీ పాల్గొన్నారు.

అంటూ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర-పామూరు రూరల్ : స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా స్థానిక మమ్మీ డాడీ సెంటర్‌లో పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం అంటువ్యాధుల గురించి పాటల రూపంలో కళాకారులు వివరించారు. అంటువ్యాధులు ఎలా సోకుతాయో పాటల రూపంలో వివరించారు. పరిసరాల పరిశుభ్రత ఇంటింటి చెత్త సేకరణ తడి పొడి చెత్త వేరు చేయుట, ప్లాస్టిక్ వాడడం వలన కలిగే నష్టాలను వారి పాటల ద్వారా ప్రజలకు తెలియజేశారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు

విశాలాంధ్ర - చెరుకుపల్లి : కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ ఈనెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహిస్తున్నట్లు ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు పి.నాగాంజనేయులు తెలిపారు. మంగళవారం మండల కేంద్రమైన చెరుకుపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్రిటీష్ వారి కాలంలోనూ స్వాతంత్రం అనంతరం పోరాడి సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రద్దుచేసి తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడులను ఆయా రాష్ట్రాల్లో అమలు చేయాలని ఒత్తిడి తీసుకురావడం జరుగుతుందన్నారు. దేశవ్యాప్తంగా మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని కోరుతూ సార్వత్రిక సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని నాగాంజనేయులు కోరారు. ఈ సమావేశంలో సిపిఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ,ఏఐటీయూసీ జిల్లా కమిటీ సభ్యులు బందారు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆగస్టులో సీపీఐ రాష్ట్ర మహాసభలు

(మొదటిపేజీ తరువాయి)

నివసిస్తున్న గిరిజనలకు రక్షణ కల్పించాలని ఆయన తెలిపారు. అడవి ప్రాంతంలో 400 మంది మరణించారు ఇంకా కాల్పులు కొనసాగిస్తున్నారు. దేశాన్ని పాలిస్తున్న ప్రధానమంత్రి మోడీ 75 సంవత్సరాల స్వతంత్ర భారతదేశంలో కష్టపడి సంపాదించిన సంపద ద్వారా మనం సృష్టించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను అత్యంత చౌకగా పారిశ్రామికవేత్తలకు, కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ఆయన విమర్శించారు. దేశంలో ఉండే ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిని ప్రైవేట్ రంగానికి కట్టబెడుతున్నారని అన్నారు. అటవీ ప్రాంతంలోకి ఆరు లైన్ల రోడ్డు వేస్తున్నారు అక్కడ గిరిజనులకు వాహనాలు ఏమి ఉండవు నడిచి వస్తారు అటవీ ప్రాంతంలో ఉండే ఖనిజ సంపదను బయటికి తరలించడానికి ఇదేచ్ఛగా సంపదను దోచిపెట్టడానికి, ప్రభుత్వ సంపదను దోచిపెట్టి ఈ రోడ్లు వేస్తున్నారని ఆయన విమర్శించారు. వెలుగొండ ప్రాజెక్టుకు నాలుగువేలు కోట్లు కేటాయించలేని సీఎం చంద్రబాబు 84 వేల కోట్లతో పలకచర్ల నిర్మాణం ఎలా చేపడుతాడని ఆయన ప్రశ్నించారు. చంద్రబాబు నాయుడు ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చారు. ఈ హామీలన్నీ నెరవేర్చాలంటే కేంద్రం బడ్జెట్ ఇస్తే తప్ప రాష్ట్ర బడ్జెట్ తో ఈ హామీలు సాధ్యం కావని ఆయన అన్నారు. మాజీ సీఎం జగన్ ఆంధ్రప్రదేశ్ ను అప్పుల రాష్ట్రంగా తీర్చిదిద్దాడని అన్నారు. పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు పూర్తయితే పశ్చిమ ప్రకాశంలో 4లక్షల ఎకరాలకు సాగునీరు, 20 లక్షల మందికి త్రాగునీరు అందుతాయని ఆయన అన్నారు. సామాన్య ప్రజానీకానికి ఏ మాత్రం అవసరం లేని రాజధాని పేరుతోటి మొత్తం రాష్ట్రాన్ని మరొకసారి అప్పులు ఊబిలోకి చంద్రబాబు తీసుకెళ్తున్నారన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి డి శ్రీనివాస్, సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి జి.గురునాథం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కేవీ కృష్ణ గౌడ్, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు మన్నే సాంబశివరావు, బాణాల రామయ్య, ప్రజానాట్య మండల నాయకులు గుంటూరు శ్రీను, వై వెంకట శివయ్య, మొగిలి వెంకటేశ్వర్లు, కే గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కొనుగోలు చేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పర్చూరు నియోజకవర్గంలోని ఉప్పుటూరు గ్రామంలో రైతులతో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. క్షేత్రస్థాయిలో పొగాకు నిల్వలు, రైతాంగం పడుతున్న ఇబ్బందులను నేరుగా తెలుసుకున్నారు. పొగాకు నిల్వలను చూసి రైతాంగానికి ధైర్యం చెప్పారు.అనంతరం గ్రామంలో రైతులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ కచ్చితంగా ప్రతి రైతు నుంచి పొగాకు కొనుగోలు చేసి తీరుతామని పేర్కొన్నారు. రైతులెవరు ధైర్య పడవద్దని, రైతులు ఇబ్బందుల్లో ఉంటే మంత్రి చంద్రబాబు కూటమి ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్నారు.

ప్రభుత్వం నేరుగా రైతుల వద్దకే వచ్చి సమస్యలు తెలుసుకునేందుకు ప్రభుత్వం కదిలి వచ్చిందని ఇది ప్రజా ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని పేర్కొన్నారు. ఏ ఒక్క రైతు నష్టానికి పంటను అమ్ముకోవాల్సిన అవసరం లేదని సరైన ధర లభించే వరకు పంట కొనుగోలు చేసే వరకు విశ్రమించకుండా రైతాంగానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు.రైతులు బాగుంటేనే ప్రభుత్వం బాగుంటుందని కంపెనీలు బాగుంటాయని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు. పొగాకు కంపెనీలు సైతం రైతుల కష్టాల్లో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిన బాధ్యత కంపెనీలదేనన్నారు. కంపెనీలు పద్ధతి మార్చుకొని రైతుల పంటలను కొనుగోలు చేయాలని కొనుగోలు చేయని పక్షంలో మెడలు వంచైనా కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటామని వార్నింగ్ ఇచ్చారు.రైతులు కష్టంలో ఉన్నప్పుడు ఆదుకోవాల్సిన బాధ్యత కంపెనీలకు లేదా అని ప్రశ్నించారు. రైతు ప్రయోజనాలను దెబ్బతీసే ఉద్దేశాన్ని తాము ఖండిస్తున్నామని,అలా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాలు రైతు మేలే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే ఏలూరి పేర్కొన్నారు.

- రైతులెవ్వరు ఆందోళన చెందొద్దు : రాజశేఖర్

రైతులెవ్వరు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని, ఎలాంటి చర్యలకు పాల్పడవద్దని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. రైతాంగానికి ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు.ఎమ్మెల్యే ఏలూరి రైతాంగం పక్షాన నిలిచి ప్రభుత్వాన్ని రైతుల వద్దకు తీసుకువచ్చారని పేర్కొన్నారు.సమస్యను పరిష్కరించేలా ఎమ్మెల్యే ఏలూరి కృషి చేస్తున్నారని వెల్లడించారు. కంపెనీలు సైతం లాభాలు గడించినప్పుడు నష్టాల్లో ఉన్నప్పుడు కూడా రైతాంగానికి హితోదికంగా సాయపడాల్సిన బాధ్యత ఉందని రాజశేఖర్ పేర్కొన్నారు.రైతులు కొంత సమయసం పాటించాలని ఒక పద్ధతి ప్రకారం కొనుగోలు చేసేలా సమస్య పరిష్కరించేలా బాధ్యత తీసుకుంటామన్నారు.

- రైతుల ప్రయోజనాలు ముఖ్యం : ఢిల్లీ రావు

రైతు ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఏ ఒక్క రైతు అధైర్యపడొద్దని వ్యవసాయ కమిషనర్ ఢిల్లీ రావు పేర్కొన్నారు. మేలు జరిగే వరకూ కృషి చేస్తామని యంత్రాంగం అనుక్షణం అండగా ఉంటుందన్నారు. ఒక పద్ధతి ప్రకారం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటా మని లేని పక్షంలో మార్క్ ఫెడ్ ద్వారా కొనుగోలు చేసే అంశాన్ని పరిశీలిస్తా మన్నారు. సమస్యను పరిష్కరించే వరకు విశ్రమించేది లేదని పేర్కొన్నారు.

పొగాకు రైతు కంట కన్నీరు

(మొదటిపేజీ తరువాయి)



వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా పొగాకు ధరల్లో పెద్దగా మార్పులు కన్పించడం లేదు. వేలం కేంద్రాల్లో కూడా కేవలం ఇద్దరు ముగ్గురు మాత్రమే వేలంలో పాల్గొంటున్నారు. దీని వెనుక ఐటీసీ ఆధిపత్యం వల్లే లైసెన్సు దారులు ఎవరూ పోటీలో పాల్గొనకుండా రైతులకు గిట్టుబాటు ధరలు రాకుండా అడ్డుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు కూడా వేలం కేంద్రాల్లో లైసెన్సు ఉన్న వ్యాపారస్తులందరూ వేలంలో పాల్గొంటే గిట్టుబాటు ధర వస్తుందేమోనన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. వీరితో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు కూడా రంగంలోకి దిగి రైతుల ఖర్చులను దృష్టిలో ఉంచుకొని రైతులకు కనీసం క్వింటాలు 2వేలు లాభం వచ్చేలా ప్రభుత్వం కొనుగోలు చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తుంది. జిల్లాలోని వెల్లంపల్లి, వెల్లంపల్లి 2, ఒంగోలు 1, ఒంగోలు 2, పొదిలి, టంగుటూరు వేలం కేంద్రాల వద్ద రైతుల గోడు చూస్తుంటే కళ్లు చెమర్చాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కష్టపడి పండించిన పంటను వేలం కేంద్రాల వద్దకు తీసుకొస్తే కనీసం గిట్టుబాటు ధర లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొగాకులో క్వాలిటీ పేరుతో రెండు మూడు గ్రేడ్‌లుగా విభజించి ఒక గ్రేడ్‌ను మాత్రమే కొనుగోలు చేస్తూ మిగితా గ్రేడ్‌లలో నాణ్యత లేదనే సాకుతో వెనక్కు పంపిస్తున్నారు. దీంతో రైతులు మానసికంగా ఆందోళన చెందుతూ తెచ్చిన అప్పులను తీర్చలేమన్న బాధతతో ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి మార్కెట్‌లో ఏర్పడుతుంది. ఇప్పటికైనా పొగాకు కొనుగోళ్ల విషయంలో వేలం కేంద్రం అధికారులతో ప్రభుత్వమే సంప్రదింపులు జరిపి రైతుల ఖర్చులకు అనుగుణంగా గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

రాయితీ దాణాను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-సంతనూతలపాడు: రాష్ట్ర ప్రభుత్వం పశుపోషకులకు 50 శాతం రాయితీతో అందించే దాణాను సద్వినియోగం చేసుకోవాలనిపశుసంవర్ధక శాఖ సంయుక్త సంచాలికులు డాక్టర్ బేబీ రాణి అన్నారు. స్థానిక పశువుల వైద్యశాల నందు మంగళవారం జరిగిన గేదల దాణా పంపిణీ కార్యక్రమనికి హాజరై ఆమె మాట్లాడుతూ ఈ దానాలో 25శాతం మాంస కృతులు కలిగి ఉంటాయని వేసవిలో వీటి ద్వారా పాల దిగుబడి వెన్న శాతం తగ్గకుండా ఆర్థికంగా వేసలపాటు కల్పిస్తుందని వెల్లడించారు. మొదటిగా 80 శాతం రాయితీతో పశువులు ఆవులకు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని అన్నారు. 1632 రూపాయలు సబ్సిడీ పోను కేవలం 288 రూపాయలు మాత్రమే రైతు చెల్లించాలని అన్నారు. గేదలు ఆవులకు 85 శాతం రాయితీతో ప్రభుత్వం కల్పిస్తున్న ఇన్సూరెన్స్ ను చేయించుకోవాలన్నారు. అదేవిధంగా గొర్రెలుమేకలకు మూడు సంవత్సరాల కాలపరిమితికి సంబంధించి ప్రభుత్వ రాయితీ పోను కేవలం 56 రూపాయలు మాత్రమే చెల్లించి బీమాను పొందాలని తెలియజేశారు. వేసవిలో పశువుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు పై పశు పోషకులకు అవగాహన కల్పించారు. అకాల వర్షలురావాటం వలన పిడుగులు పడే అవకాశం ఉందని ముఖ్యంగా చెట్ల కింద వారి పశువులను గొర్రెలు మేకలను నిలపరాదన్నారు. స్థానిక పశువుల హాస్పిటల్ లో నీటి తొట్టెలను అందుబాటులో ఉంచినట్లుతెలిపారు. ఇప్పటికే జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద రాయితీపై మినీ గోకులాలు కేటాయించి నట్టు ఆమె తెలిపారు. అదేవిధంగా రాయితీపై పశుగ్రాస విత్తనాలు బీమా కల్పిస్తున్నట్టు ఆమె తెలిపారు.

నాటు సారాయి తయారీపై దాడి

ఒకరి అరెస్ట్

విశాలాంధ్ర పెద్ద దోర్నాల : మండలంలోని వై చర్లపల్లి గ్రామ శివారులలో నవోదయం 2.0 భాగంగా, ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం, ఒంగోలు మరియు మార్కాపురం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ బృందం కలిసి మంగళవారం దోర్నాల మండలం వై.చర్లపల్లి గ్రామంలో దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా 30 లీటర్ల నాటు సారాయిని స్వాధీనం చేసుకొని, దాసరి రామయ్య నల్లగుంట్ల గ్రామం, దోర్నాల మండలం అనే వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. ఈ కేసులో మెగావత్ చందు నాయక్, పై కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తులో ఈ కేసుకు సంబంధించి ఇతర నిందితులను, బెల్లం సరఫరా చేసిన వారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి, ఎక్సైజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయండి

- జూన్ 21,22,23 తేదీల్లో దర్శిలో నిర్వహణ
- కరపత్రాలను ఆవిష్కరించిన శివరామిరెడ్డి

విశాలాంధ్ర-దర్శి : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 17వ జిల్లా మహాసభలు జూన్ 21 22 23 తేదీలలో దర్శిలో జరుగుతున్నాయని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఎం రమేష్ బాబు తెలిపారు. సిపిఐ 17వ జిల్లా మహాసభల కరపత్రాలను మంగళవారం మోహన్ మిల్క్ లైన్ అధినేత ఆహ్వాన సంఘ గౌరవ అధ్యక్షులు కే శివరామిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్శిలో కమ్యూనిస్టు పార్టీ మహాసభలు జరగటం శుభ పరిణామం అని ఆయన అన్నారు. దర్శిలో ఈ మహాసభలో మొట్టమొదటి సారిగా జరుగుతున్నాయని ఆయన తెలిపారు. ఈ మహాసభలో జాతీయ రాష్ట్ర జిల్లా సమస్యలు సమగ్ర అభివృద్ధిపై చర్చించి భవిష్యత్తు ఉద్యమ కార్యచరణ దర్శిలో రూపుదిద్దుకోబోతుందని ఆయన వివరించారు. ఈ మహాసభలకు జిల్లా నలుమూలల నుండి సిపిఐ కార్యకర్తలు విచ్చేసి మూడు రోజులు పాటు దర్శి లోనే ఉంటారని వివరించారు. ఈ మహాసభలను దర్శి ప్రాంత వాసులంతా కలిసి జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కె. హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్ కరుణానిధి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ రామాంజి యాదవ్, ఆర్డబ్ల్యూఎస్ నాయకులు సింగరకొండ శ్రీను, సిపిఐ నాయకులు కల్లూరి పెద్ద ఆంజనేయులు, బత్తుల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీసాధన డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి పుస్తకాలు వితరణ



విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : వేలమంది విద్యార్థులు డిగ్రీ చదువుకుంటూ ప్రభుత్వరంగ పోటీ పరీక్షలలోనూ వివిధ ప్రైవేటు రంగ కొలువులలోనూ రాణించేందుకు ప్రధాన భూమిక పోషిస్తున్న శ్రీసాధన డిగ్రీ కళాశాల గ్రంథాలయానికి పుస్తక ప్రేమికులైన డాక్టర్ సి.ఎ ప్రసాద్ ఆచార్య కె.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావులు భారీ స్థాయిలో పుస్తకాలు సమకూర్చి గ్రంథాలయాన్ని పరిపుష్టం చేశారని ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ తెలిపారు. అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం ఉపకుల సచివులుగా పనిచేసిన ఆచార్య కె. నాగేశ్వరరావు భారతదేశ ఆర్థిక వ్యవస్థ, జర్నల్ స్టడీస్, గ్రామీణాభివృద్ధి, ప్రణాళికలు మొదలైన అంశాలకు చెందిన రూ.10,000లకు పైగా విలువ చేసే 35 అకాడమీ పుస్తకాలను వారి సోదరులు టీచర్ కె. శ్రీనివాసరావు ద్వారా కళాశాల విద్యార్థులకోసం గ్రంథాలయానికి సమర్పించారని అలాగే ప్రముఖ వ్యక్తిత్వ వికాస శిక్షణా నిపుణులు డాక్టర్ సి.ఎ ప్రసాద్ విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదిగేందుకు ఉపకరించే వివిధ అంశాలకు చెందిన రూ. 60 వేలు విలువచేసే 550 పుస్తకాలను శ్రీసాధనకు అందించారని ఈ అమూల్య పుస్తక సంపద ద్వారా కళాశాల గ్రంథాలయానికి మరింత బలం చేకూరిందని ప్రిన్సిపల్ కె.మధుసూదన్ పేర్కొన్నారు.

పశ్చిమ ప్రకాశంలో యువతకు మెరుగైన విద్యను అందించేందుకు సహకరిస్తున్న ఆచార్య కె.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, డాక్టర్ సి.ఎ ప్రసాద్లకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కప్పగంతుల మధుసూదన్ లతోపాటు డైరెక్టర్లు ఎం.వి కృష్ణారెడ్డి, వి.ఆర్.కె ప్రసాద్, డా వెన్నా కృష్ణారెడ్డి, జి.యల్ రమేష్బాబు కళాశాల సెక్రెటరీ అండ్ కరెస్పాండెంట్ డి రాజుగోపాల్రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీధర్ కుమార్, క్యాంపస్ అండ్ రిక్రూట్మెంట్ ట్రైనింగ్ విభాగం సమన్వయకర్త కె. సనన్ కుమార్, పరిశోధన విభాగం సమన్వయకర్త డాక్టర్ యమ్. శేషుకుమార్, కళాశాల ఇన్చార్జ్ డాంపి. ఆర్.కె ప్రసాద్లు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యపక మరియు అధ్యపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్స్కు అభినందనలు

విశాలాంధ్ర - కనిగిరి: స్థానికంగా ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ కానిస్టేబుల్లకు మంగళవారం డిఎస్పి కార్యాలయంలో డిఎస్పీ పి సాయి ఈశ్వర్ యశ్వంత్ సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరామ్ల సహాయంతో ట్రాఫిక్ కానిస్టేబుల్స్కి వైట్ హ్యాట్, కూలింగ్ గ్లాసెలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండుటెండలో కూడా పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ని కంట్రోల్ చేసి వాహనదారులకు దిశ నిర్దేశం చేస్తూ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్స్ను ముందుగా అభినందించారు. అనంతరం ఎండ తీవ్రత నుంచి వడ దెబ్బ తగలకుండా తమను తాము రక్షించుకోవడానికి వైట్ హ్యాట్, కూలింగ్ గ్లాసులను ట్రాఫిక్ కానిస్టేబుల్స్కి అందజేశారు.

చెత్త సేకరణతోనే గ్రామాల పరిశుభ్రత

ఎంపీడీవో ప్రభాకర్ శర్మ

విశాలాంధ్ర-పీసీపల్లి : చెత్త సేకరణతోనే గ్రామాల పరిశుభ్రత ఏర్పడుతుందని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల నుంచి తడి పొడి చెత్తను సేకరించాలని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ అన్నారు. గ్రీన్ అంబాసిడర్స్ ఈ బాధ్యతను నిర్వర్తించేలా పంచాయతీ కార్యదర్శి, ఇఒపిఆర్డిలు పర్యవేక్షించాలని ఆదేశించారు.మండలంలోని ఐవి ఆర్ యస్ మోడల్ విలేజ్ అయిన మారెళ్ళ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్డబ్ల్యుపిసి కేంద్రంలో వసతులు, వర్మీ తయారీకి ఏర్పాటు చేసిన విట్స్ను పరిశీలించారు. ఇంకా ఎక్కువగా వర్మీ తయారీకి చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శి షర్మిలను ఆదేశించారు.వర్మీ కంపోస్టు విక్రయం చేందుకు కేంద్రం బయట స్టాల్ను నిర్మించాలని సర్పంచ్ వెంకట్రావుకు సూచించారు. కేంద్రం పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేసి, సిబ్బంది మరింత బాధ్యతగా పనిచేసి సంపూర్ణ పారిశుధ్య గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఎస్ రాంప్రసాద్ పంచాయతీ కార్యదర్శి షర్మిల గ్రీన్ అంబాసిడర్లో పాల్గొన్నారు.

తాగునీటి పైప్ లైన్ పనులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : దోర్నాల పట్టణంలోని సుందరయ్య కాలనీకి నీరు అందించే పైప్ లైన్ పనులకు టీడీపీ ఇన్ఛార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మంగళవారం భూమి పూజకు నిర్వహించారు. ఆయన ముక్కల. పశువుల ఆసుపత్రి వద్ద నుండి సుందరయ్య కాలనీకి పైప్లైన్ నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. నేటి ఇబ్బందులు తీర్చేందుకు ఈ పైపులను ఎంతగానో ఉపయోగపడుతుంది అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎరువ మల్లికార్జున రెడ్డి, షేక్ మాబు, బట్టు సుధాకర్ రెడ్డి, మేజర్ పంచాయతీ సర్పంచ్ చిత్తూరి హారిక, దుర్గా శేషాద్రి, ఈదర మల్లయ్య చంటి, ఎంపీడీఓ నాసర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి శివ కోటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : పెద్ద దోర్నాల మండల జనసేన నాయకులు ఆధ్వర్యంలో దోర్నాలలోని నటరాజ్ సెంటర్లో మంగళవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఏర్పాటుచేసిన చలివేంద్రంను ఏపీ టూరిజం శాఖ డైరెక్టర్, ఎర్రగొండపాలెం జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ పాకనాటి గౌతమ్ రాజు రిబ్బన్ కటింగ్ చేసి చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. వీరి వెంట నియోజవర్గ జనసేన నాయకులు జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాతకోటి సుబ్బారావు, చింతకుంట్ల మల్లికార్జున, పెద్ద పండు, పి.సుధాకర్, కె.ప్రసాద్, ఫణి పాల్గొన్నారు.

బాలికలు ఉజ్వల భవిష్యత్ కోసమే కిశోరి వికాసం

విశాలాంధ్ర-పొన్నలూరు : మండల కేంద్రమైన పొన్నలూరు అంగన్వాడీ కేంద్రంలో అంగన్వాడి సూపర్వైజర్ రమాదేవి అధ్యక్షతన కిషోర్ వికాసం కార్యక్రమం నిర్వహించారు. రమాదేవి మాట్లాడుతూ యుక్త వయసులో ఉన్న బాలికలు, మహిళల ఉజ్వల భవిష్యత్తుకు 'కిశోరి వికాసం' కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని ఆడపిల్లల ఉజ్వలమైన, ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు కిశోరి వికాసం పునః ప్రారంభం పునాది వేస్తుందన్నారు. బాల్యం నుంచి యుక్త వయసు వరకు ఎవరి నుంచీ మోసపోకుండా కిశోరి బాలికలకు అవగాహన కల్పించి, అనంతరం పిల్లలకు యువతకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై పూర్తిస్థాయిలో తెలియ పరిచారు. కార్యక్రమంలో మండల టీడీపి నాయకులు మండవ మురళీ మోహన్, ఎంఎస్ కె.స్వర్ణలత, ఆశా నాగలక్ష్మి, కార్యకర్తలు మధురవాణి, రాధా, అవంతిక, ఎస్.కె గౌస్య పాల్గొన్నారు.

భూకంపంతో భయాందోళనలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రమైన ముండ్లమూరుతో పాటు పలు గ్రామాలలో మంగళవారం ఉదయం భూమి కంపించడంతో ప్రజలు భయాందోళనలు చెందు తున్నారు.. ఉదయం 10 గంటల సమయంలో ఒక్క సారిగా భూమి కంపించడంతో వివిధ పనుల్లో నిమగ్నమైన ప్రజలు ఉలిక్కిపడ్డారు. రెప్పపాటులో రెండు సెకండ్ల పాటు భూమి కంపించడంతో ప్రజలు ఇండ్ల నుండి బయటకు పరుగు తీశారు. భయభ్రాంతులకు గురయ్యారు. గతంలో పలుమార్లు మండలంలో పలు గ్రామాల్లో భూమి కంపించడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

బాలికలకు కౌమార దశపై అవగాహన

విశాలాంధ్ర - కనిగిరి: మండల పరిధిలోని చిర్లదిన్నె ఎస్సీ కాలనీలో మంగళవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ యంవిఎస్ పార్వతి ఆధ్వర్యంలో కిశోరి వికాసం రెండవ దశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 11 నుంచి 18 సంవత్సరాల కిషోర్ బాలికలకు కౌమార దశలో వచ్చే మార్పులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి కిషోర్ బాలికలను ఉద్దేశించి మాట్లాడుతూ రుతుక్రమము అనేది స్త్రీలలో వచ్చే సహజ ప్రక్రియ అని ఇది లేకపోతే మానవజాతేలేదని తెలిపారు. రుతుక్రమానికి ముందు వచ్చే మార్పులు, వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, సానిటరీ నాప్కిన్స్ వాడకం, కౌమారదశలో బాలికల్లో కలిగే మార్పులు, స్త్రీ ప్రత్యుత్పత్తి అవయవాలపై అవగాహన, రుతుస్రావం వలన రక్తహీనత కలుగుతుందని నివారణకు తృణ ధాన్యాలు, తాజా పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, గుడ్లు,పాలు, చేపలు, మాంసం, డ్రై ఫ్రూట్స్, గింజలు, బీన్స్, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు వంటివి తీసు కోవాలన్నారు. బాలికలందరూ 18 సంవత్సరాల లోపు వివాహం చేసుకోకూడదని బాలికలు విద్యను కొనసాగించాలని లింగ వివక్షత, లైంగిక వేధింపులు నుంచి రక్షణ అలాగే సంపూర్ణ పోషకాహారంపై అవగాహన కల్పించారు. అనంతరం బాల్య వివాహం నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. కిషోర్ బాలికలు, మహిళలు, అంగన్వాడీ కార్యకర్తలు ఐ రాజ్యలక్ష్మి, బి శిరీష, బి రజిని, ఏ వరలక్ష్మి పాల్గొన్నారు.

రౌడీ షీటర్లపై నిఘా

డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్

విశాలాంధ్ర - కనిగిరి: డీఎస్పీ పి.సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో కనిగిరిలో కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగింది. కార్డెన్ సెర్చ్ ఆపరేషన్‌పై స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో సోమవారం డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కానిస్టేబుల్స్‌ను టీమ్‌గా ఏర్పాటు చేసి గత నెల రోజులుగా రౌడీ షీటర్లు, అనుమానితులపై అలాగే అపరిచితులు ఎవరైనా స్థానిక ఇళ్లల్లో నివ సిస్తున్నారా, గంజాయి వంటి మత్తు పదార్థాలను ఇళ్లల్లో దాచి ఉంచారా అనే విషయాలపై నిఘా ఉంచినట్లు తెలియజేశారు. అందులో భాగంగానే సోమవారం ఉదయం కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఆపరేషన్‌లో తనతో పాటు 5 గురు ఎస్ఐలు 1 సిఐ పాల్గొన్నారని తెలియజేశారు. సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను అదుపులోకి తీసుకున్నట్లు అందులో 30 మోటార్ సైకిళ్ల రెండు ఆటోలను సీజ్ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని ఆయన సూచించారు. అదేవిధంగా తల్లిదండ్రులు పిల్లల విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని వారు ఎక్కడికి వెళ్తున్నారు, ఏం చేస్తున్నారు, అనే విషయాలు ఎప్పటికప్పుడు గమనించుకుంటూ ఉండాలన్నారు. గంజాయి నిర్వహణపై సమగ్రమైన సమాచారం ఉందని త్వరలోనే తగు చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. రౌడీ షీటర్ల పై పోలీసుల నిఘా ఏర్పాటు చేశామని అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనుమానితులు ఎవరైనా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిస్తే మీడియా, అలాగే ప్రజలు వెంటనే పోలీసుల దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐ షేక్ ఖాజావలి, ఎస్సై టి శ్రీరామ్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ప్రణాళిక సిద్ధం చెయ్యాలి

విశాలాంధ్ర- తాళ్లూరు: ప్రకృతిలోని ప్రతి వనరును ఉపయోగించుకుని నేలను సజీవంగా ఉంచి మంచి నాణ్యమైన ఉత్పత్తులు సాధించాలని వ్యవసాయాధికారి ప్రసాద రావు అన్నారు. తూర్పుగంగవరం రైతు సేవా కేంద్రంలో మంగళవారం ప్రకృతి వ్యవసాయం ఖరీఫ్ -2025 ప్రణాళిక సిద్ధం చేయటానికి పొదుపు సంఘాలు, రైతులతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి సాగు మాస్టర్ ట్రైనర్ జె.ప్రభాకర్ మాట్లాడుతూ 365 రోజులు భూమిని పచ్చని పంటలతో ఉంచేందుకు తగిన ప్రణాళికను వివరించారు. నవ ధాన్యాల కిట్ ను తీసుకుని వేసవిలో ముందుకు పొలంలో చల్లినట్లయితే తొలకరి వర్షాలకు మొలకెత్తి నేల సారవంతమౌతుందని చెప్పారు. ప్రకృతి సాగు మండల ఇన్చార్జి నరసింహులు మాట్లాడుతూ మహిళా సంఘాల వీఓఏల ప్రతి ఒక్కరి సాగు వివరాలు అందులలో ప్రకృతి సాగు వివరాలను నమోదు చెయ్యాలని కోరారు.

అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసీఆర్పీలు వాణి, రమేష్, రత్నం, అనంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. భిన్న వాతావరణ పరిస్థితులలో పిడుగు పాటుకు, విద్యుత్ షాక్లకు గురికాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అందుకు గ్రామాలలో ప్రచారం విరివిగా నిర్వహించాలని గుడి, దేవాలయాలు, మసీదులతో మైక్ల ద్వారా ప్రజలకు అప్రమత్తం చెయ్యాలని వ్యవసాయాధికారి సూచించారు.

ఒరిగిన విద్యుత్ స్తంభాలు.. పొంచి ఉన్న ప్రమాదం

● పట్టించుకోని అధికారులు ● ఆందోళన చెందుతున్న ప్రజలు

విశాలాంధ్ర-పామూరు రూరల్ : పట్టణంలోని కందుకూర్ రోడ్డు డివి పార్క్‌లో ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు. ఎప్పుడు ఏ విద్యుత్ స్తంభం పడి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న స్తంభాలు కూలిపోవటానికి సిద్ధంగా ఉన్న అధికారులు అటు వైపు కన్నెత్తి చూడటం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిరోజు సాయంత్రం ఈదురు గాలులు వీస్తుండటంతో విద్యుత్ స్తంభాలు, ఎప్పుడు విరిగి రోడ్డుమీద వెళు న్న ప్రజలపై పడతాయోనని ప్రజలు బంబేలెత్తుతున్నారు. విద్యుత్ స్తంభాలు ఒరిగిపోవటంతో తీగలు చేతికి అందేలా వేలాడుతున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బాల్య వివాహాల నియంత్రణపై అవగాహన

విశాలాంధ్ర-సిఎస్ పురం : వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా పై అవగాహన కల్పించాలి అని లీగల్ అధికారి రత్న ప్రసాద్ అన్నారు. మంగళవారం వెలుగు కార్యాలయంలో సిడిపిఓ దేవకృపావరం అధ్యక్షతన మహిళా పోలీసులకి, ఎం పి హెచ్ లు, అంగన్వాడి కార్యకర్తలకి, ఆశా కార్యకర్తలు, వివో ఏలు లకు కిషోరి వికాసం ప్రోగ్రాం పై అవగాహన కల్పించినారు. ఈ సందర్భంగా ఐసిపిఎస్ లీగల్ రత్న ప్రసాద్, జిల్లా కోఆర్డినేటర్ వెంకటలక్ష్మి, డాక్టర్ హేమాలు మాట్లాడుతూ వేసవి సెలవుల్లో కిశోర బాలికలకు గ్రామస్థాయిలో 5 గురు కమిటీ సభ్యులు కిశోర బాలికలను గుర్తించి 10 లేక 15 మందిని గ్రూపుగా చేసి వ్యక్తిగత రుతుస్రావ పరిశుభ్రత, నైతిక విలువలు, ట్రాఫికింగ్, గుడ్ టచ్ -బ్యాడ్ టచ్, లైంగిక వేధింపులు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్వయంకృషి సేవాసంస్థ అధ్యక్షులు డాక్టర్ షేక్ నాయబ్ రసూల్ పాల్గొన్నారు.

ఆకతాయిలు హద్దు మీరితే కఠిన చర్యలు

పామూరు సీఐ ఎం.భీమా నాయక్

విశాలాంధ్ర-పామూరు : సమాజంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని పామూరు సీఐ ఎం భీమా నాయక్ హెచ్చరించారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామ శివారులో గంజాయి, మద్యం సేవించడం, తమ ఇష్టానుసారం వాహనాల నడపడం, అల్లరి చేయడం, గొడవలు సృష్టించడం, ఆకతాయిల చేష్టలు తమ దృష్టికి వచ్చాయని నియంత్రణ చేసేందుకు ప్లాన్ రూపొందించామన్నారు. పెడదారి పట్టుతున్న పిల్లలను తల్లిదండ్రులు సక్రమమైన మార్గంలో పెట్టాలని, మీ పరిధి దాటితే మాకు తెలపాలన్నారు. పెడమార్గంలో పయనించే యువతకు అవగాహన కల్పించి సరైన మార్గంలో ఉంచేందుకు ప్రయత్నిస్తామన్నారు. అప్పటికి వినకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంతో భవిష్యత్తు కలిగిన యువత సమాజంలో గౌరవప్రదంగా జీవించాలన్నారు. రౌడీ షీటర్లు, ఆకతాయిలు, మందుబాబులుకు గతంలో అవగాహన కల్పించి సత్ప్రవర్తనతో జీవించాలని హెచ్చరికలు చేసి ఉన్నామన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ, మహిళలపై చిన్నారులపై జరిగే నేరాల పట్ల, మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే అనర్ధాల పట్ల, సైబర్ నేరాల పట్ల ప్రజలు అవగాహన కలిగి ఉండాలన్నారు.

విద్యుత్ శాఖకు భారీ నష్టం

విశాలాంధ్ర - సంతమాగు లూరు : ఇటీవల సంభవించిన గాలివాన భీభత్సానికి సంతమాగులూరు మండలంలో విద్యుత్ శాఖకు ఆస్తి నష్టం వాటి ల్లిందని ఆ శాఖ ఏఈ దీపక్ రెడ్డి చెప్పారు. ఆయన తెలిపిన వివ రాల ప్రకారం మండలంలోని మిన్నెకల్లు రోడ్డు, పుట్టావారి పాలెం,కామేపల్లి, కుందుర్రు తదితర ప్రాంతాల్లో పెనుగాలులకు 31కిపైగా విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయని, మరికొన్ని మరమ్మతులకు గురైనట్లు తెలిపారు. పాత వాటి స్థానంలో నూతన స్తంభాలు ఏర్పాటుకు గత వారం రోజులుగా విద్యుత్ సిబ్బం దితో కలిసి పనులను శరవేగంగా పూర్తి చేసినట్లు చెప్పారు. కొన్నిచోట్ల చెట్ల కొమ్మలపై తీగలు ఇరుక్కు పోవడంతో జేసీబీతో వాటిని తొల గించి, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సుమారు రూ.4లక్షలకుపైగా ఆస్తి నష్టం వాటిల్లిందని ఏఈ పేర్కొన్నారు.

బాలికల భవితకు భరోసా 'కిశోరి వికాసం'

విశాలాంధ్ర - సంత మాగులూరు : మహిళా భివృద్ధి,శిశు సంక్షేమ శాఖ వారి సౌజన్యంతో ఏర్పాటు చేసిన కిశోరి వికాసం వేసవి శిక్షణ తరగతులు వలన బాలికల భవితకు భరోసా ఇస్తాయని సంత మాగులూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సూపర్ వైజర్ జి.ప్రమీల అన్నారు. మంగళ వారం ఏల్చూరులోని మైనారిటీ దర్గా బజార్ వద్ద ఉన్న అంగన్వాడీ కేంద్రంలో శిక్షణ తరగతులపై అవగాహన కల్పించారు.ఈసందర్భంగా ఆమె మాట్లా డుతూ కిశోరి వికాసం ప్రారంభం కావడం బాలికల అదృష్టమని చెప్పారు.దీని ద్వారా పిల్లల్లో దాగివున్న నైపుణ్యాలను మెరుగు పరచుకొనేందుకు దోహద పడుతాయన్నారు. అదేవిధంగా ఆడపిల్లలు యుక్త వయస్సులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. దీంతో పాటు రుతుక్రమం సమయంలో పరిశుభ్రత పాటించాలని సూచించారు.తద్వారా అనారోగ్య సమస్యలు దరిచేరవన్నారు. అదేవిధంగా లైంగిక విద్య పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం కిశోరి వికాసం కరపత్రాలను ఆవిష్కరించి ప్రతిజ్ఞ చేశారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఎస్కే.మస్తాన్ బి,షాకిరూన్, చిన్న మ్మ, మస్తాన్ బి,మహిళా పోలీసులు మహాలక్ష్మి,అమీన్,సుమన పాల్గొన్నారు.

400 ఏళ్లనాటి చెట్టు..
బాటసారుల సేద తీరేందుకు నిలయం

విశాలాంధ్ర - జె.పంగు లూరు : మండలంలోని కశ్యా పురం గ్రామంలో 400 సంవత్స రాల నాటి మర్రి చెట్టు ప్రజలను బాగా ఆకర్ష స్తుంది. కశ్యాపురం గ్రామంలో రేణింగ వరం - అద్దంకి రోడ్డు ప్రక్కనే భూమి లోకి చొచ్చుకొని పోయిన పెద్ద పెద్ద ఊడలుతో ఉన్న ఈ చెట్టు ఆరోడ్డు పై వెళ్లే ప్రయాణికులను, చుట్టుప్రక్కల గ్రామాల ప్రజలను బాగా ఆకర్షస్తూ అనేక మంది ప్రయాణికులకు చేద తిరిస్తూ మంచి ఆహ్లాదాన్ని కలి గిస్తుంది. అలాగే అనేక రకాల పక్షులు ఈ చెట్టును ఆసరాగా చేసుకొని జీవిస్తు న్నాయని ఈ మర్రి చెట్టుకు 400 వందల సంవత్సరాల వయసు ఉందని, ఎన్ని తుఫాన్లు గాలివానలు వచ్చినప్పటికి ఈ చెట్టుకు ఏమీ కాకుండా చుట్టూ ఊడలుతో బలంగా ఉందని కశ్యాపురం గ్రామ ప్రజలు చెబుతున్నారు.ఈ చెట్టుకు తూర్పు వైపున చెరువు పడమర వైపున ప్రాథమిక పాఠశాల నిర్మించడంవల్ల విద్యార్థు లకు కూడా మరింత ఆహ్లాదం కలిగిస్తుంది అని స్థానికులు చెపుతున్నారు.

రైతులకు న్యాయం చేయాలి

విశాలాంధ్ర - కొండపి : వివిధ పంటలు సాగు చేసిన రైతులు గిట్టుబాటు ధరలు లేక ఇబ్బందులు పడుతున్నారని ప్రభుత్వం స్పందించి గిట్టుబాటు ధర లభించేలా చూసి తగిన న్యాయం చేయా లని మండల వైఎస్ఆర్సిపి కన్వీనర్ బచ్చల కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. పొగాకు సెనగ కంది మిర్చి తదితర పంటలు సాగు చేసి గిట్టుబాటు ధరలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని మంగళవారం కొండపిలో వైఎస్ఆర్సిపి మండల పార్టీ అధ్యక్షుడు బచ్చల కోటేశ్వ రరావు మాట్లాడారు. పొగాకు ధరలు గిట్టుబాటు లేక పొగాకు రైతులు ఆవేదన చెందుతున్నారని అన్నారు. మిర్చి కంది సెనగ పంటలు సాగుచేసిన రైతులకు సైతం సరైన ధరలు లేక నష్టాలు మూట గట్టుకుంటున్నారని తెలిపారు. రైతులు ఇబ్బందులు పడుతున్న కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. వైఎస్ఆర్సిపి జగన్ పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారని , కూటమి పాలనలో రైతులు అన్ని విధాల నష్టపోయారని అన్నారు. ప్రభుత్వం తక్షణం రైతులను ఆదుకుని గిట్టుబాటు ధరలు కల్పించాలని డిమాండ్ చేశారు.

విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - సంతమాగులూరు : ప్రకాశం జిల్లా గ్రంథాలయం సంస్థ, ఒంగోలు వారి సౌజన్యంతో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు బాదం విజయభాస్కర్ రెడ్డి సూచించారు. మంగళవారం శాఖ గ్రంథాలయం సంతమాగులూరులో 8వ రోజున 20మంది బాలబాలికలు హాజరయ్యారు.లైబ్రేరియన్ ఆధ్వర్యంలో చిన్నారులకు కథలు,కథనాలపై అవగాహన కల్పించి, పిల్లలతో పుస్తక పఠనం చేయించారు.పాఠాలపై వారికున్న అనుమానాలను నివృత్తి చేశారు. మండలం లోని అన్ని పాఠశాలలకు వేసవి సెలవులు ఇచ్చినందున విద్యార్థులను తప్పనిసరిగా లైబ్రరీకి పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

మొబైల్ ఫోనుల్లో ప్రభుత్వ సేవలు
- ఎంపీడీవో నాగలక్ష్మి

విశాలాంధ్ర - నిజాంపట్నం : మన మిత్ర - వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రభుత్వ సేవల న్నింటినీ మొబైల్ ఫోనుల్లో సులువు గా పొందవచ్చు అని ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి అన్నారు.మంగళవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ స్టాండ్స్ను ఎంపీడీవో ఎన్.నాగలక్ష్మి ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ స్టాండ్స్ ప్రజలకు అందుబాటులో ఉంటాయని చెప్పారు.ప్రజలు మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ను సద్వినియోగం చూసుకొని మొబైల్ ఫోనుల్లో ప్రభుత్వ సేవలను పొందాలని సూచించారు.మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్ స్టాండ్స్లను మండలంలోని అన్ని పంచాయతీలలో ప్రజలకు అందుబాటులో ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో సూచించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు బొమ్మిడి వీరా స్వామి,బెల్లంకొండ నాగ సుబ్బారావు,జూనియర్ అసిస్టెంట్ ఎ.రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రంధాలయంలో వేసవి శిక్షణ శిబిరం

విశాలాంధ్ర - కురిచేడు : స్థానిక గ్రంథాలయములో వేసవి శిక్షణ శిబిరము నిర్వహిస్తున్నట్లు గ్రంథ పాలకురాలు ఎల్ సుమతి పత్రికా ప్రక టన ద్వారా బుధవారం తెలియజేశారు. ఇందులో భాగంగా బుధవారం శిబిరంలో విద్యార్థులకు కథలు చదివించడం కథలు వినిపించడం , ఇండోర్ గేమ్స్ ఆడించామని అన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ఏఎన్ఎం కోటేశ్వరి విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత ఎలా పాటించాలి అనే అంశంపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ ప్రమీల ఏఎన్ఎం కోటేశ్వరి, గ్రంధ పాలకరాలు ఎల్ సుమతి పాల్గొన్నారు.

మండల న్యాయ సేవాధికార సంస్థ అవగాహన సదస్సు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల మండల న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో బాపట్ల ఏపీఎస్ఆర్టీసీ డిపో గ్యారేజ్లో జరిగిన న్యాయ అవగాహన సదస్సులో బాపట్ల మండల న్యాయ సేవ అధికార సంస్థ ప్యానెల్ లాయర్ దగ్గుమల్లి కిరణ్ కుమార్ చట్టాలపై అవగాహన కల్గించారు. ఆర్టీసీ గ్యారేజ్ కార్మికులకు చట్టాల గురించి కార్మికులకు సంక్షేమ కోసం,వారికి సమానత్వం,కార్మికులకు తగిన ప్రాముఖ్యత,ఉద్యోగ భద్రత,వారి పిల్లలకు విద్య,కార్మిక కుటుంబాలకు జీవిత భీమా,ఆరోగ్య భద్రత,భద్రతాపరమైన అంశాలు అవగాహన కల్పిస్తూ కార్మికులను చైతన్యవంతులను కావాలన్నారు.ఈ కార్యక్రమానికి ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ శ్రీమన్నారాయణ,ఆధునిక ప్రపంచంలో చట్టాల గురించి తెలుసుకొని చట్టాలలోని అంశాలను అవలంబించడం ద్వారా మెరుగైన సమాజంలోకి ఈ సమాజాన్ని తీసుకోవచ్చున్నారు.ఈ కార్యక్రమంలో బాపట్ల మండల న్యాయ సేవ అధికార సంస్థ పార లీగల్ వారింటర్లు ప్రసాద్,శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

యువతను నిర్లక్ష్యం చేసిన వైసీపీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు రద్దు చేయడం, ఉద్యోగ నోటిఫికేషన్లు లేకపో వడం, కొత్త పరిశ్రమలు రాక పోవడం, ఉన్నవి తరలిపోవ దం, నిరుద్యోగ భృతి రద్దు వంటి జగన్ ప్రభుత్వ చర్యలతో యువత రోడ్డున పడ్డారని బాపట్ల పార్లమెంట్ టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మొవ్వ శరత్చంద్ర అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యువత సంక్షే మం కోసం ప్రత్యేక దృష్టి పెట్టి 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. గడిచిన 11 నెలల్లో 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ, 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీ,రూ.8.5 లక్షల కోట్ల పెట్టుబడులతో 5 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించేలా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంద న్నారు. గంజాయి,డ్రగ్స్పై ఉక్కుపాదం మోపడం కోసం ఆపరేషన్ ఈగిల్ కార్య క్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. తల్లిదండ్రులు ఆశయ సాధన కోసం, వారి ఆనందం కోసం ఉన్నత లక్ష్యాల వైపు యువత పయనించాలని టీఎన్ఎస్ఎఫ్ తరపున పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంట్ సెక్రటరీ పరిస గోపి,తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉడత దేవేందర్ బాలాజీ,కర్రి సుధీర్ తదితర యువత నాయకులు పాల్గొన్నారు.

సింగరకొండ ఆలయానికి రూ.1,01,116లు విరాళం

విశాలాంధ్ర - అద్దంకి : సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండప ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన మేక వెంకటేశ్వరరావు అల్లుడు ధర్మవరపు భాస్కరరావు ధర్మ పత్ని సుజాత మంగళవారం ఆలయ అసిస్టెంట్ కమిషనర్ తిమ్మనాయు డుకు రూ. 1,01,116లు విరాళాన్ని అందజేశారు.

శక్తి యాప్‌పై విస్తృత అవగాహన

విశాలాంధ్ర - బాపట్ల : మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ ఆవశ్యకత, వినియోగం,దానిలో నిక్షిప్తం చేయబడిన పలు అంశాల గురించి జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఆదేశాల మేరకు జిల్లాలోని శక్తి బృందాలు మహిళలకు విస్తృతంగా అవగాహన కల్పించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు బాపట్ల,చీరాల,రేపల్లె శక్తి బృందాలు జిల్లాలోని కోచింగ్ సెంటర్స్, ఫ్యాక్టరీలు, మాల్స్, బస్టాండ్లు,రైల్వే స్టేషన్లు,ఇతర కార్యాలయాలు,జన సమూహం ఉండే ఇతర ప్రదేశాలతోపాటు జిల్లాలోని పలు ముఖ్యమైన ప్రాంతాలను సందర్శించారు.మహిళలకు శక్తి యాప్ ను ఏ విధంగా వారి మొబైల్ ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలి,వినియోగించు విధానం,యాప్‌లో పొందుపరచబడి ఉన్న విస్తృతమైన సమాచారం గురించి వివరించారు. అంతేకాకుండా గుడ్ టచ్-బ్యాడ్ టచ్,బాల్య వివాహాల నిషేధ చట్టం, సైబర్ నేరాలు, ఫోక్సో చట్టం,వివిధ హెల్ప్ లైన్ నెంబర్లు వాటిని వినియోగించుకునే విషయాల గురించి అవగాహన కల్పించారు.

కిశోరి బాలికలు సమతుల్య ఆహారం తీసుకోవాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : కిశోరి బాలికలు సమతుల ఆహారం తీసుకోవాలని పల్లపట్ల ఐసీడీఎస్ సీడీపీఓ ఎం.అనసూయ సూచించారు.కిశోరి వికాసం వేసవి శిక్షణ కార్యక్రమం రెండవ సెషన్‌లో భాగంగా మంగళవారం నిజాంపట్నం 1,2,3 గ్రామ సచివాలయాలలో కిశోరి బాలికలకు ఋతుస్రావం-పరిశుభ్రతపై సీడీపీఓ ఎం.అనసూయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కిశోరి బాలికలకు ఐరన్,విటమిన్-సి సమృద్ధిగా ఉన్న ఆహారాలు,సమతుల ఆహారం వాటి యొక్క ఉపయోగాలు గురించి సీడీపీఓ ఎం.అనసూయ వివరించారు.అలాగే ఋతుస్రావం - పరిశుభ్రత గురించి వీడియోల రూపంలో ప్రదర్శించి కిశోరి బాలికలకు చూపించారు.ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు విజయకృష్ణ, స్రవంతి,శివ పార్వతి,ఐసీడీఎస్ సూపర్ వైజర్ పివిబి ప్రసూన,అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి కంపెనీ వర్కర్స్

యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

- కంపెనీ మేనేజర్‌ను కలసిన కమిటీ సభ్యులు

విశాలాంధ్ర - చీరాల : ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి కంపెనీ వర్కర్స్ యూనియన్ ఇకపై సీఐటియు అనుబంధం కాదని నూతన ఫెడరేషన్ అధ్యక్షుడు చిప్పలపల్లి శివరాజు అన్నారు. ఏపీ ఫెడరేషన్ ఆఫ్ ఐఎల్‌టిడి కంపెనీ వర్కర్స్ (రిజిస్టర్ నెంబర్ 3249, గుర్తింపు పొందిన సంఘం)రాష్ట్ర మహాసభ 2025 మే 1న ఈపురుపాలెం ఆటోనగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ మహాసభలో మొదటిగా, కొత్త రాష్ట్ర కమిటీకి ఎన్నికలు నిర్వహించి సభ్యులను ఎన్నుకున్నారు. ఇప్పటివరకు కొనసాగు తున్న సీఐటీ యూతో ఉన్న అనుబంధాన్ని రద్దు చేసుకున్నారు.

- నూతన రాష్ట్ర కమిటీ సభ్యులు :

రాష్ట్ర అధ్యక్షుడుగా చిప్పలపల్లి శివరాజును,రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా గంట సుధీర్,రాష్ట్ర కోశాధికారిగా పఠాన్ నాగుల్ మీరాను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొత్తంగా 25 మంది సభ్యులతో కూడిన రాష్ట్ర ఆఫీస్ బేరర్లను ఈ కమిటీలో ఎన్నుకుని, అనంతరం ఈ నూతన కమిటీని గుంటూరు ఐఆర్ఎంటీ పవన్‌కుమార్‌కు అధికారికంగా పరిచయం చేశారు. అనంతరం సంస్థ ఫ్యాక్టరీ మేనేజర్ శ్యాంసుందర్,పర్సనల్ మేనేజర్ రామకృష్ణను కలసి కొత్త కమిటీ వివరాలు తెలియజేశారు. అనంతరం నూతన అధ్యక్షుడు చిప్పలపల్లి శివరాజు మాట్లాడుతూ ఫెడరేషన్ పునర్నిర్మాణ దిశగా నూతన కమిటీ పని చేస్తుందని ఐఎల్టిడి జోడకుల యూనియన్ ఇకపై సీఐటియు అనుబంధం కాదని స్వతంత్రంగా పని చేస్తుందన్నారు. సిఐటియుతో విడిపోవాలనే నిర్ణయం ఫెడరేషన్ స్వతంత్రంగా పనిచేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు.

అంగరంగ వైభవంగా పోలేరమ్మ తిరునాళ్ల

విశాలాంధ్ర - చీరాల రూరల్ : చీరాల మండలం తోటవారిపాలెం గ్రామంలో కొలువై ఉన్న శ్రీ పోలేరమ్మ తల్లి 56వ తిరునాళ్ళ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉదయం నుండి వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ పరిసర ప్రాంతాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. విద్యుత్ ప్రభలు అందరినీ ఆకర్షించాయి. ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి.కనకతప్పెట్ల మధ్య భక్తుల చిందులతో,బందారు ధూపాలతో నిర్వహించిన శిడిమాను ఉత్సవాన్ని తిలకించడానికి ప్రజలు వేల సంఖ్యలో తరలి వచ్చారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రదేశాల నుండి వచ్చిన పోలీసులు బందోబస్తు నిర్వహించారు.భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భక్తుల కోరికలు నెరవేర్చే దేవతగా, భక్తుల కొంగు బంగారంగా నిలిచిన అమ్మ భక్తులను కరుణిస్తున్నదన్నారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజలకు మజ్జిగ అందించారు.ఈ కార్యక్రమాల్లో భక్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు. జనసేన పార్టీ జెండాను నాయకులు గూడూరు శివరామ ప్రసాద్ ఆవిష్కరించారు.

వేసవి శిక్షణా తరగతులు సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో గల రేపల్లె,నగరం, రేపల్లె మున్సిపాలిటీలలో కిషోరి వికాసం సమ్మర్ కాంపెయిన్‌ను అన్ని గ్రామాలలో నిర్వహించటం జరుగుతుందని ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి ఎం.సుచిత్ర అన్నారు. మంగళవారం నిర్వహించిన ఈ శిక్షణా తరగతుల్లో ఆమె పాల్గొన్నారు. శిక్షణ తరగతులలో భాగంగా పరిశుభ్రత, ఆరోగ్యం శ్రేయస్సు మొదలగు అంశాలపై బాలికలకు అవగాహన కల్పించారు. మంగళవారం రేపల్లె మండలంలోని తుమ్మల గ్రామంలో ఈ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు పి.నాంచారమ్మ, ఎస్.సువర్ణ,మహిళ సంరక్ష కార్యదర్శి ఎం. వెంకరమణ, యానిమేటర్ ఎం.పద్మ, అంగన్వాడీ కార్యకర్తలు, కిషోరి బాలికలు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ పథకానికి 19,599 మంది రైతులు అర్హులు

విశాలాంధ్ర - అద్దంకి : ఈ నెలలో అమలు కానున్న అన్నదాత సుఖీభవ పథకానికి సంబంధించి అద్దంకి మండలంలో 19,599 మంది రైతులను అర్హులుగా గుర్తిస్తూ ప్రభుత్వం వెబ్ ల్యాండ్ డేటాను పంపించినట్లు మండల వ్యవసాయ అధికారి వెంకటకృష్ణ తెలిపారు.ఏవో మాట్లాడుతూ ఈ డేటాను తనిఖీ చేసి చనిపోయిన వారిని ప్రభుత్వ ఉద్యోగులను ఆదాయ పనులు చెల్లించే వారిని కోర్టు కేసులలో ఉన్న వారిని పదివేలు పైబడి పింఛన్ తీసుకునే వారిని అనర్హులుగా గుర్తించి అర్హుల జాబితా నుండి తొలగిస్తామన్నారు.రైతులు గ్రామాలలో ఉన్న రైతు సేవా కేంద్రాలలో ఈనెల 20 లోపు గ్రామ వ్యవసాయ సహాయకుల వద్ద వెబ్ ల్యాండ్ డేటాను చూసుకొని తేడాలు ఉంటే సరి చేసుకోవాలని ఏవో రైతులకు సూచించారు..

గ్రామాల్లో మద్యాన్ని ఏరులై పారిస్తున్న కూటమి ప్రభుత్వం

విశాలాంధ్ర - వేమూరు : ఎన్నికల ముందు మద్యం అమ్మకాలను నియంత్రిస్తామని, మద్యం రేట్లు తగ్గిస్తామని అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక గ్రామాల్లో మద్యాన్ని ఏర్లుగా పారిస్తున్నారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్ బాబు విమర్శించారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మద్యం షాపులను తమ అనుయాయులకు అప్పగించి గ్రామ గ్రామాల్లో బెల్ట్ షాపులు నిర్వహిస్తూ మద్యాన్ని నిత్యవసర సరుకుల మాదిరి అందరికీ అందుబాటులోకి తెచ్చిందని ఎద్దేవా చేశారు.లైసెన్స్ షాపుల్లో పర్మిట్ రూములు లేకపోయినా బార్లు మాదిరిగా అక్కడే సిట్టింగ్ ఏర్పాటు చేసి సమయపాలన లేకుండా అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలను జోరుగా సాగిస్తున్నారన్నారు.నాలుగు రోడ్ల కూడళ్లలో బస్టాండ్ సెంటర్లో ఏర్పాటు చేసిన మద్యం దుకాణాల వల్ల ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వీటిని ప్రశ్నిస్తే తప్పుడు కేసులు బనాయిస్తూ బెదిరింపులకు పాల్పడుతు న్నారని అశోక్ బాబు విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వంలో జరిగిన విద్యుత్ ఒప్పందాలను తప్పుప డుతూ అధికరేట్లకు విద్యుత్ ఒప్పందాలు చూసుకుందని విమర్శలు చేసిన చంద్రబాబు నాయుడు ప్రస్తుతం జరుగుతున్న విద్యుత్ ఒప్పందాల్లో గత ప్రభుత్వంలో ఒప్పందాల కంటే అధిక రేట్లకు విద్యుత్ కొనుగోలు చేస్తున్నారని ఆ డబ్బు ఎవరి జేబుల్లోకి వెళుతుందని అశోక్‌బాబు ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలు పెంచమంటూ ఎన్నికల ముందు హామీ ఇచ్చిన చంద్రబాబు నాయుడు విద్యుత్ ఛార్జీలు ఇష్టానుసారంగా పెంచి ప్రజలపై పెనుబారం మోపుతు న్నారని అశోక్ బాబు తెలియజేశారు. చంద్రబాబు నాయుడు అబద్ధపు హామీలు ప్రజలు గుర్తుంచుకుంటారని రాబోయే రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చెపుతారని అశోక్ బాబు హెచ్చరించారు.

అమ్మవారికి కుంభాభిషేకం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : పేరాలలో కొలువై ఉన్న శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం నవీకరణ జరుపుకున్నది. ఈ సందర్భంగా శ్రీ వాసవి అమ్మవారికి పునఃప్రతిష్ఠ, కుంభాభిషేక మహోత్సవాలను అంగరంగ వైభవంగా ఈ నెల 7వ తేదీ బుధ వారం జరుపనున్నారు. అనంతరం అన్న సమా రాధన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి,ఈ కార్యక్రమాలను జయప్రదం చేయవలసినదిగా విజ్ఞప్తి చేశారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : ఆశా వర్కర్లకు నెలకు కనీస వేతనం రూ. 26 వేలు అందించాలని, ఆశాలను కార్మికులుగా గుర్తించాలని కోరుతూ చీరాల మండలం ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దేవికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లా డుతూ ఆశా వర్కర్లను హెల్త్ కమ్యూనిటీ వర్కర్ ఆశాలుగా మార్పు చేయాలన్నారు. ఈనెల 20న జరుగనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో వెంకటేశ్వరమ్మ, రూస్సీలక్ష్మి, ధనలక్ష్మి, ప్రభావతి, శివ శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటు బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర- ఒంగోలు : ఒంగోలు మండలం పెద్ద దేవరం పాడు గ్రామంలో పిడుగు పడి మృతి చెందిన నూకసాని శిరీషా కుటుంబానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు ప్రభుత్వం తరపున రూ.4 లక్షల చెక్కును అందజేశారు. మున్సిపల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సంతనూతలపాడు ఎమ్మెల్యే బి.ఎన్. విజయ్ కుమార్ ,డిఆర్‌ఓ ఓబులేసు,మేయర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

సుబ్బయ్య దంపతులకు పలువురు శుభాకాంక్షలు

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం జడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, నర్రా నాగమణి దంపతుల మ్యారేజ్ యానివర్సరీ వేడుకలను నిజాంపట్నంలో బాపట్ల జిల్లా బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షులు పచ్చపల్ల గంగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును నర్రా సుబ్బయ్య,నర్రా నాగమణి దంపతులచే కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం యువజన జిల్లా జాయింట్ సెక్రెటరీ బడుగు శివ రాకేష్,బీసీ సంక్షేమ సంఘం యువజన నిజాంపట్నం మండల అధ్యక్షులు గాలి రాజు,జనసేన మండల అధ్యక్షులు నరేష్ యాదవ్,ఫైబర్ బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాయుడు గోపి, టీడీపీ నాయకులు లంకె మీరయ్య, పీత సోమయ్య, అముదాలపల్లి టీడీపీ నాయకులు పందరబోయిన శ్రీనివాసరావు,అముదాలపల్లి సర్పంచ్ నర్రా కృష్ణ,నర్రా వెంకటేశ్వర్లు,నర్రా సునీల్, బడుగు నాగరాజు,నర్రా సుబ్బయ్య (ఆర్మీ),కీర్తి శ్రీను,కన్నెటి శ్రీనివాసరావు ఉన్నారు.

ప్రమాదంలో కోత మిషన్ కార్మికుడు మృతి

విశాలాంధ్ర - చెరుకుపల్లి : కోత మిషన్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్న ఆరుంబాక దళి తవాడకు చెందిన మేము ఆదినారాయణ(సుమన్) (40) ప్రమాదవశాత్తు మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. తోటి కార్మికులు చెబుతున్న వివరాల ప్రకారం విజయనగరం నుండి వచ్చిన తాటి చెట్ల లోడు దించే క్రమంలో లారీకి కట్టిన మోకు ఒక్కసారిగా తెగిపోవడంతో లారీపై పేర్చిన తాటి చెట్లు హఠాత్తుగా కిందకి దొర్లిపడ్డాయి. గమనించిన కార్మికుల కొంతమంది దూరం పరిగెత్తగా సుమన్ తప్పించుకోలేకపోయాడని తాడిచెట్లు అతని తలపై వరుసగా పడటంతో అతను అక్కడి కక్కడే మృతి చెందాడని తెలిపారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై టి.అనిల్ కుమార్ తెలిపారు.

నల్లబర్లీ పొగాకు చెక్కులు దగ్ధం చేసి నిరసన

మోసం చేసిన ప్రయివేట్ కంపెనీలు

విశాలాంధ్ర - నాగులుప్పలపాడు : నల్లబర్లీ పొగాకు చేయాలని మండలంలోని కండ్లగుంట గ్రామ పొగాకు రైతులు మంగళవారం నాగులుప్పలపాడులోని ఇంకొల్లు రోడ్డు వద్ద పొగాకు చెక్కులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈసందర్భంగా పొగాకు రైతులు మాట్లాడుతూ ఈఏడాది అనేక ప్రయివేట్ కంపెనీలు ఎన్ని మిలియన్లు పొగాకు పండించిన కొనుగోలు చేస్తామని రైతులను ప్రోత్సహించి రైతులచేత సాగు చేయించారు. తీరా పంట మొత్తం చేతికి వచ్చిన తరువాత చెక్కులు కట్టి అమ్మకానికి సిద్ధం చేయగా నాణ్యత తక్కువగా ఉందని చెక్కులు తిరిగి కట్టాలని కంటి సాకులతో రైతులకు ఇబ్బందికి గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. పలుమార్లు రైతుసంఘాల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. తద్వారా ప్రభుత్వం దిగివచ్చి పొగాకు కొనగోలు కంపెనీల ద్వారా చేయిస్తామని మానిటరింగ్ కమిటిని ఏర్పాటు చేసారు. కాని నేటికి కొనుగోలు ప్రారంభించలేదు. దాంతో రైతులు పండించిన పంటను నిల్వచేసుకునేందుకు వసతులు లేక ఇబ్బందులు ఎదుర్కొంటూ ఆందోళనకు దిగారు ఏకరానికి 1.50 వేలు పెట్టుబడి పెట్టి కూలీలకు కూడ డబ్బులు ఇవ్వలేని పరిస్థితి నేలకొందని ఆవేదన వ్యక్తంచేసారు. నాణ్యతలేదని ప్రోత్సహించిన ప్రయివేట్ కంపెనీలు కుంటి సాకు చూపి తిరస్కరించారని దాంతో కూలీలకు కూడ డబ్బులు ఇవ్వలేని పరిస్థితిలో ఏమిచేయాలో అర్ధంకాని పరిస్థితుల్లో పొగాకు చెక్కులను నాగులుప్పలపాడు తీసుకువచ్చి దగ్ధం చేసి నిరసన తెలిపామన్నారు.

మనం ప్రజా సేవకులం

- ప్రజల క్షేమం కోసం పని చేయాలి
- ఎమ్మెల్యే అయినా కార్పొరేటర్ అయినా ప్రజలకు బావాబిదారిగా ఉండాలి
- ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ రావు
- ఒంగోలు మున్సిపల్ కౌన్సిల్‌లో 124 అంశాలు అమోదం

విశాలాంధ్ర - ఒంగోలు : మనం ప్రజా సేవకులం, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలి, వారితో జవాబిదారిగా ఉండాలి, ప్రజల క్షేమం కోసం నిరంతరం పని చేయాలని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ మున్సిపల్ అధికారులకు సూచించారు. మంగళవారం ఒంగోలు నగర పాలక సంస్థ కౌన్సిల్ సాధారణ సమావేశంలో కౌన్సిల్‌లో మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన జరిగింది. ఈసమావేశానికి ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్, సంతనూతలపాడు శాసన సభ్యులు బీఎన్ విజయ కుమార్‌లతో పాటు టిడిపి, జనసేన, వైసిపి కార్పొరేటర్లు హాజరైయ్యారు. ఉదయం 11.50 మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన కౌన్సిల్ ప్రారంభం అయ్యింది. అజెండాలోని 124 అంశాలను సభ్యుల ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ప్రధానంగా నగరంలో పారిశుద్ధ్యం, త్రాగు నీరు, అభివృద్ధి పనులపై కొందరు సభ్యులు కౌన్సిల్ మాట్లాడారు. కొన్ని డివిజన్లలో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందని, చెత్తా చెదారం సేకరణలో సిబ్బంది అలసత్వం ప్రదర్శిస్తున్నారని సభ్యులు ఆరోపించారు. అదే విధంగా కొన్ని ఏరియాల్లో చెత్త సేకరణ చేసే వారు రూ. 50లు డబ్బులు అడుగుతున్నట్లు కార్పొరేటర్లు ఇమ్రాన్, గోపిలు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. గత ప్రభుత్వంలో చెత్త సేకరణ పన్ను ఉండేది, ఈ ప్రభుత్వంలో అలాంటిదేమి లేదని స్పష్టం చేశారు.

అధికారంలో ఉన్నా...
నా డివిజన్‌లో పనులు జరగడం లేదు :

ఎన్డీయే కూటమిలో జన సేన భాగస్వామి గా ఉన్నప్పటికీ నా డివిజన్‌లో అభి వృద్ధి పనులు జరగడం లేదని 38వ డివిజన్ జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ మున్సిపల్ అధికారుల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ డివిజన్‌లో అభివృద్ధి పనుల విషయాలను అనేక మార్లు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రజల చేత ఎన్నుకోబడ్డ కార్పొరేటర్లం మేము, డివిజన్‌లో అభివృద్ధి పనులు జరగకపోతే తమను నిలదీస్తారని అన్నారు. కోర్టు క్లీరెన్స్ ఇచ్చినప్పటికీ పనులు ప్రారంభించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తమ డివిజన్‌పై వివక్ష తగదని జనసేన కార్పొరేటర్ మలగా రమేష్ కౌన్సిల్ సూటిగా మాట్లాడారు. దానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ సమాధానం ఇచ్చారు. కమిషనర్‌కు పలు సూచనలు చేశారు. అందరికి సమానంగా పనులు కేటాయింపులు జరిగేలా చూడాలని, సమిష్టిగా ఒంగోలు అభివృద్ధికి పాటుపడాలని సూచించారు.

- జీతాలు తీసుకొని టైంపాస్ చేస్తే కుదరదు
ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్

ప్రతీ జీతాలు తీసుకుంటూ పనులు చేయకుండా టైం పాస్ చేస్తే కుదురుదని ఒంగోలు శాసన సభ్యులు దామచర్ల జనార్ధన్ హెచ్చరించారు. ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం కావొస్తున్నా ఒంగోలులో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉందన్నారు. డివిజన్‌లో పని చేసే పారిశుద్ధ్య కార్మికులు విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. ఎక్కడ మస్టర్లు వేస్తున్నారు...? ఎక్కడ పని చేస్తున్నారో...? ఇన్‌స్పెక్టర్లు తప్పని సరిగా నిత్య పర్యవేక్షణ ఉండాలని ఆదేశించారు. ఒంగోలులో అభివృద్ధి పనులు ఊపందుకున్నాయి. ఈ క్రమంలో నిర్ణీత గడువులో పనులు మొదలు పెట్టని కాంట్రాక్టర్లను హెచ్చరించండి, మారని పక్షాన ఆయా కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని కమిషనర్‌కు సూచించారు. అదే విధంగా ఒంగోలులో త్రాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు గుండ్లకమ్మ నుండి ఒంగోలుకు పైప్ లైన్‌ను పూర్తి చేసేందుకు అమృత స్కీం-2 నుండి నిధులు కేటాయింపులు జరుగుతాయని, త్వరలోనే పనులు పూర్తి చేసి ఒంగోలులో ప్రతీ రోజు త్రాగు నీరును అందిస్తామని తెలిపారు.

మా వంతు పూర్తి సహకారం అందిస్తాం
-సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

ఒంగోలు అభివృద్ధిలో తమ వంతు సహకారం అందిస్తామని సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. ఒంగోలు నగర పరిధిలో సంతనూతలపాడు నియోజక వర్గం కలిసి వుందని, తమ ప్రాంత అభివృద్ధి తమకు ముఖ్యమే అన్నారు. ఒంగోలు అభివృద్ధికోసం నిధులు రాబట్టేందుకు తమ వంతు సహకారం ఇస్తామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకే పోలీస్ యంత్రాంగం : డీఎస్పీ

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె సబ్ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు అధిక ప్రాధాన్యతనిస్తూ మహిళలపై ఎలాంటి అఘాయిత్యాలకు పాల్పడినా చట్టపరంగా సత్వరం శిక్షించేలా చర్యలు తీసుకుంటున్నామని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.మంగళవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని 12 పోలీస్ స్టేషన్లు ఉన్నాయని ట్రాఫిక్ సమస్యలు డివిజన్‌లో తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.ట్రాఫిక్ నియంత్రణకు ప్రధాన కూడళ్ల వద్ద సిబ్బందిని ఏర్పాటు చేసి ట్రాఫిక్ క్రమబద్దీకరణ చేసేలా చూస్తామన్నారు. కార్లు నడిపే వాహనదారులు సీటు బెల్ట్, ద్విచక్ర వాహన దారులు హెల్మెట్ ధరించాలన్నారు. సెల్ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపుతున్నా, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోయినా, రహదారులపై వాహనాలు అడ్డదిడ్డంగా నిలిపినా వారి వద్ద నుంచి అపరాధ రుసుం వసూలు చేస్తున్నట్లు తెలిపారు. గంజాయి, అక్రమ మద్యం విక్రయాలపై ఎస్పి ఆదేశాల మేరకు గంజాయి, అక్రమ మద్యం నియంత్రణకు చెక్ పోస్టుల వద్ద,జాతీయ రహదారిపై నిఘా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. గంజాయి విషయంలో ఎవరైనా సమాచారం అందించవచ్చునని వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. మహిళలపై వేదింపులు, బాలికలను, మహిళలను వేధించే పోకిరీలను వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. డివిజన్లో పలుచోట్ల సీసీ కెమెరాల ఏర్పాటు, ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఎస్పీ వివరించారు. నేరాలకు పాల్పడే వారు ఎలాంటి వారైనా చర్యలు తీసుకుంటామన్నారు.డివిజన్‌లోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలను సందర్శించి సూచనలు చేస్తున్నామనీ, రోడ్డు ప్రమాదాల నివారణకు తరచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్లు, జంక్షన్లను గుర్తించి, ఇంజినీర్ల సహకారంతో నివారణ చర్యలు చేపడుతున్నామన్నారు. పాఠశాలల్లో రహదారి భద్రత క్లబ్బులు ఏర్పాటు చేసి,రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన పెంపొందించాలన్నారు.

వెట్టి చాకిరి నిర్మూలనకు చర్యలు చిన్న పిల్లలతో వెట్టి చాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ శ్రీనివాసరావు హెచ్చరించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు అందరు సహకరించాలని కోరారు.18 సంవత్సరాల లోపు పిల్లలు గొర్రెలు, పశువుల కాపరులుగా, కిరాణం, మెకానిక్ దుకాణాలు,హొటళ్ళు,ఇటుకల బట్టీల్లో పనిచేస్తున్న,రోడ్లపై భిక్షాటన చేస్తున్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగిస్తామని, లేదంటే స్టేట్‌హోమ్‌కు పంపిస్తామని చెప్పారు. అధికారులందరూ సమష్టిగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఒంటరిగా ఉండే వారు తప్పిపోయిన, వదిలివేయబడిన పిల్లలు, శారీరక, మానసిక,లైంగిక, ఆర్థిక దోపిడీలకు, హింసకు గురౌతున్న బాలలను గుర్తిస్తే, 1098 లేదా 100 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని డీఎస్పీ సూచించారు.

టీడీపీ కార్యకర్తలకు పార్టీ అండగా ఉంటుంది

విశాలాంధ్ర - పెద్ద దోర్నాల : తెలుగుదేశం పార్టీ కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ ఎప్పుడు అంతగా ఉంటుందని. ఎర్రగొండ పాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు తెలిపారు. మంగళవారం దోర్నాలోని స్థానిక శివ సదనమ్‌లో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న ఎర్రగొండపాలెం టిడిపి ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు మండల తెలుగుదేశం పార్టీ సంస్థాగత పార్టీ కమిటీల ఎన్నికపై తెలుగుదేశం పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం గురించి వివరించారు. తెలుగుదేశం పార్టీ గ్రామ కమిటీ నాయకులను నియమించడం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ కోసం పనిచేసిన ప్రతి ఒక్కరికి న్యాయం జరిగేలా చూస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాల్ట్ భూములను పరిశీలించి మార్కెట్ ధరలను నిర్ణయించాలి : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : సాల్ట్ భూములను పరిశీలించి, వాటికి మార్కెట్ ధరలను నిర్ణ యించాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. సాల్ట్ భూముల పరిశీలన,ధరల నిర్ధరణపై అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. సాల్ట్ భూములు ఉన్న ప్రాంతాలను పరిశీలించాలని, ఇందు కోసం జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జిల్లా పరిధిలోని చిన్నగంజాం మండలంలో 2,486 ఎకరాల భూములు సాల్ట్ కమిషన్ అధీనంలో ఉన్నాయన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆ భూములను సర్వే చేయాలన్నారు.ఆ భూమి ప్రస్తుత పరిస్థితిపై సమగ్ర నివేదిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి కమిటీ క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు.తదుపరి ఆ ప్రాంతంలో మార్కెట్ ధరలు,సాల్ట్ భూముల విలువను నిర్ధరణ చేస్తూ ధరలపై నివేదిక సమర్పించాలన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.గంగాధర్ గౌడ్, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ అధికారి,చీరాల ఆర్డీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయండి

సీపీఐ కొండెపి నియోజకవర్గ కార్యదర్శి కె వీరారెడ్డి

విశాలాంధ్ర - సింగరాయకొండ : బీజేపీ నాయకత్వంలోని 11 సంవత్సరాల ఎడిఏ ప్రభుత్వ కార్మిక, ప్రజావ్యతిరేక విధానాల ఫలితంగా నిరుద్యోగం పెరుగుతుందని ఉద్యోగాల గ్యారంటీ, నాణ్యత అమానుష స్థాయికి దిగజారి పోయిందని,మరో పక్కు కార్పొరేట్ కంపెనీల లాభాలు అనేక రెట్లు పెరిగి దేశంలో ఆర్థిక అసమానతలు వల్ల అట్టడుగు వర్గాల ప్రజలు దిగజారిపోతున్నారని సిపిఐ కొండెపి నియోజకవర్గ కార్యదర్శి కె వీరారెడ్డి అన్నారు. ఈ నేపథ్యంలో మే 20వ తేదీన దేశవ్యాప్తంగా జరుగుతున్న కార్మిక ఉద్యోగ సంఘాల సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మంగళవారం సింగరాయకొండ మండల పరిధిలోని కామ్రేడ్ దాచూరి రామిరెడ్డి భవనంలో ప్రజా సంఘాల ఉమ్మడి సమావేశం కె వీరారెడ్డి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు మాట్లాడుతూ ప్రపంచ ప్రజలంతా ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని బతికిన కరోనా కాలంలో మోడీ ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా కార్మికవర్గం బ్రిటీష్ కాలం నుండి పోరాడి సాధించుకున్న 29 కార్మిక అనుకూల చట్టాలను రద్దు చేసి కార్మిక వ్యతిరేక 4 లేబర్ కోడ్లను తెచ్చిందని ఇవి అమల్లోకి వస్తే ఈ కోడ్స్ వలన నిర్దేశిత కాల ఉద్యోగాల (ఫిక్స్ టర్మ్ ఎంప్లాయిమెంట్) ప్రవేశంతో ఉద్యోగ భద్ర ఉండదని కార్మికులను తొలగించే అధికారం యజమానులకు వస్తుందని,సమ్మె చేయటం నేరం. లక్షలాది కోట్ల రూపాయల రబీఎఫ్. ఈపీఎస్, ఈఎస్ఐ నిల్వలు స్టాక్ మార్కెట్లో మరియు మెడికల్ ఇన్సూరెన్స్ కార్పొరేట్ల హస్తగతమవుతాయని తెలిపారు.కార్మికులకు సామాజి భద్రత వర్తిస్తుందని ఒక్క మాటలో చెప్పాలంటే కార్మికులను కార్పొరేట్లకు కట్టుబానిసలుగా మార్చే విధానమే లేబర్‌కోడ్స్. వీటి అమలును దేశవ్యాప్తంగా కార్మికవర్గం వ్యతిరేకిస్తోందని పేర్కొన్నారు. అదేవిదంగా కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం రాష్ట్రంలో లక్షలాది కుటుంబాలు పేదరికంలో ఉన్నాయని, పేదలను దాతల దయా దాక్షిణ్యాలకు వదిలేసే రాష్ట్ర ఎన్.డి.ఏ ప్రభుత్వ విధానాన్ని రాష్ట్ర సదస్సు ఖండిస్తూ కార్మిక ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం పై ఐక్య పోరాటం చేస్తేనే మన హక్కులను దక్కించుకోగలమని వివరించారు. ఈ సమావేశంలో సీపీఐ కొండెపి నియోజకవర్గ సహాయ కార్యదర్శి గద్దల బాలకోటయ్య, సిపిఐ మండల నాయకులు బాలాజీ, సిపిఎం నాయకులు గంటేనపల్లి శ్రీనివాసులు, టంగుటూరు రాము, జై భీమ్ అంబేద్కర్ రాష్ట్ర నాయకులు అంబటి కొండలరావు, ముస్లిం మైనార్టీ నాయకులు సుల్తాన్ భాషా,అంగన్వాడీ ఆశా వర్కర్లు , కార్మికులు పాల్గొన్నారు.

శిడిమాను ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

- డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు

విశాలాంధ్ర - నిజాంపట్నం : నిజాంపట్నం గ్రామ దేవత శ్రీ మొగదారమ్మ తల్లి శిడిమాను ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పోలీస్ వారికి సహకరించాలని రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు అన్నారు. నిజాంపట్నం గ్రామ దేవత శ్రీ మొగదారమ్మ తల్లి శిడిమాను ఉత్సవాలు సందర్భం గా జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మంగళవారం మొగదారమ్మ తల్లి దేవస్థాన కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలతో రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సంద ర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ శిడిమాను ఉత్సవా లకు వచ్చే భక్తులకు, మహిళలకు,చిన్న పిల్లలకు, వృద్ధులకు ఎటు వంటి అసౌకర్యం కలగకుండా దేవస్థాన కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు.శిడిమాను ఉత్స వాలు సందర్భంగా ఊరేగింపు సమయాలలో ఎవరూ కూడా గజ్జలు, కర్రలు, ఆయుధాలు లాంటివి తీసుకురాకూడదని అలా ఎవరైనా వాటిని తీసుకువస్తే వారిపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసు వారి పటిష్టమైన బందోబస్తుతో పాటు దేవస్థాన కమిటీ సభ్యులు, పెద్దల ఆధ్వ ర్యంలో వాలంటర్లను కూడా నియమించనున్నట్లు తెలిపారు.ఉత్సవాలను ఎప్పటికప్పుడు పరిశీ లించడానికి సీసీ కెమెరాలు, డ్రోన్ల వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యకలాపాలలో ఎటువంటి అశ్లీనత ప్రదర్శించవద్దని అన్నారు. ఎవరైనా శాంతి భద్ర తలకు భంగం వాటిల్లే చర్యలు చేపట్టిన, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన సంబంధిత వ్యక్తులపై చట్ట పరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో రేపల్లె రూరల్ సీఐ సురేష్ బాబు, నిజాంపట్నం ఎస్సై కె.తిరుపతిరావు, దేవస్థానం కమిటీ చైర్మన్ కన్నా శ్రీనివాసరావు,బోటు యూని యన్ ప్రెసిడెంట్ మోపిదేవి శ్రీనివాసరావు, మొగదారమ్మ తల్లి దేవస్థానం కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నమ్మకమే విజయానికి తొలి మెట్టు

- బలహీనులు బలవంతులకు సాయం అందించండి
- నావంతుగా ఐదు ఎస్టీ కుటుంబాలు దత్తత
- మున్సిపల్ కమిషనర్ జి.రఘునాథరెడ్డి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : మనం చేయగలం అని నమ్మకం పెట్టుకుంటే చాలు...మన నమ్మకమే విజయానికి తొలి మెట్టు అని మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. జీరో పావర్టీ-పి4 పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్టనర్‌షిప్ ఇనిషియేటివ్ ద్వారా సంపన్న పౌరులు ఆర్థికంగా బలహీనంగా ఉన్న కుటుంబాలకు సామాజిక, ఆర్థిక సంపూర్ణ సహాయం అందించటంలో తన వంతు బాధ్యతగా ఆయన మద్దతు ఇవ్వడానికి మార్గదర్శిగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. బాపట్ల పురపాలక సంఘ పరిధిలో ఇప్పటికీ 5ఎస్టి బంగారు కుటుం బాలను దత్తతు తీసుకోగా మూడవ వార్డు రాజీవ్ గాంధీ కాలనీలో ఒక కుటుంబమైన మొదగండి సంధ్య గృహాన్ని స్వయంగా సందర్శించారు. వారి కుటుంబ ఆర్థిక స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారి ముగ్గురు పిల్లలతో కమిషనర్ కొంతసేపు ముచ్చటించారు. పిల్లలు విద్యకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. వారి కుటుంబ ఎదుగుదల సమిష్టి వృద్ధి ప్రయాణానికి వారికి కొన్ని సూచనలు చేశారు. పట్టణ ప్రజలను ఉద్దేశించి కమిషనర్ మాట్లాడుతూ బాపట్ల పురపాలక సంఘ ములో 13,336 కుటుంబాలను సర్వే చేయగా ం వారు 2,359 కుటుంబాలను బంగారు కుటుంబాలుగా ఎంపిక చేసియున్నారన్నారు.ఆసక్తి ఉన్న పట్టణ పౌరులు పెద్ద మనసుతో ఈ పి4 తో 2,359 కుటుంబాలను దత్తత తీసుకోవడం ద్వారా వారి బంగారు శ్రేయస్సుకు దోహద పడే భవిష్యత్తును సాకారం చేసుకోవడానికి వారికి సహకరించాలని,ఆంధ్ర రాష్ట్రంలో ఉన్న పేదరికాన్ని నిర్మూలించవచ్చన్నారు.

పొగాకు రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని వీరన్నపాలెంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన పొగాకు సాగు చేసిన రైతు ఉప్పుటూరి సాంబశివరావు (42) ఇంట్లో ఉరి వేసుకుని మంగళవారం ఆత్మహత్య చేసుకోవడంతో కుటుంబ సభ్యులు భోరున విలపించారు. గ్రామంలో విషాచాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన మృతుడు సాంబశివరావు ఐదు ఎకరాల్లో పొగాకు పంటను సాగు చేశాడు. దానికి కావాల్సిన పెట్టుబడి మొత్తాన్ని అప్పు తెచ్చు కున్నాడు. పొగాకు పంట ఇంటికి వచ్చిన తర్వాత దానిని కొనుగోలు చేసేందుకు ఎవరూ రాలేదు. ప్రస్తుతం పొగాకుకి గిట్టు బాటు ధర లేకపోవడం, దీనికి తోడు అతని అనారోగ్యం కూడ కొంత క్షీణించడంతో ఇబ్బందు లను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. ఇతనికి భార్య యశోధ, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. కూతురు ప్రియదర్శిని ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, కుమారుడు అజయ్ పదవ తరగతి చ . రాష్ట్ర వ్యవ సాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ మంగళ వారం పొగాకు పండించిన రైతులతో మాట్లాడేందుకు ఉప్పుటూరు గ్రామానికి వస్తున్న తరుణంలో రైతు ఆత్మహత్య అంతా చర్చనీ యాంశంగా మారింది. సమాచారం అందుకున్న గ్రామ రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పర్చూరు ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు.

దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించాలి

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : దళితులు క్రిస్టియన్ మతంలోకి మారిన మరుక్షణం ఎస్సీ హోదా కోల్పోతుందని రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన తీర్పు దుర దృష్టకరమని బహుజన సమాజ్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ గుదే రాజారావు అన్నారు. ఏ మతంలోకి మారినా దళితులు అంట రానితనానికి వివక్షతకు గురవు తూనే ఉన్నారన్నారు. క్రిస్టియానిటీ కులాన్ని గుర్తిం చకపోయినా కులవివక్ష కొనసాగుతున్నదని అనేక నివేదికలు వెల్లడించాయన్నారు.మన దేశంలో కులం మతంపై ఆధారపడిలేదు అని వ్యవస్థీకృతమై ఉందని కులం పునాదుల్ని తొలగించడానికి అవసరమైన రాజకీయ, ఆర్థిక, సామాజిక చర్యల్ని తీసుకోవాలన్నారు. దళిత క్రిస్టియన్లను ఎస్సీలుగా గుర్తించా లని బహుజన సమాజ్ పార్టీ కోరారు. అందుకు అవసరమైన చట్టబద్ధమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బహుజన సమాజ్ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. రాష్ట్రంలో మతం కులంపై ఆధారపడి దళితులపై వివక్ష కొనసాగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవంలోకి మారి న వారు ఎస్సీ,ఎస్టీ నిరోధక చట్టం కింద ఫిర్యాదు చేయలేరని, ఒక వేళ ఆ ఫిర్యాదు ఆధా రంగా కేసు నమోదు చేసినా, అది చెల్లదని హైకోర్టు తేల్చి చెప్పిందని మతం మారిన మాత్రాన కులం మారిందా కులానికి మతా నికి ముడి పెట్టొద్దని, ఎస్సీ,ఎస్టీ అత్యాచార చట్టం నిర్వీర్యం అయ్యే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. రానున్న కాలంలో దళిత క్రైస్తవులపై దాడులు పెరిగే పులు, ఆర్థికంగా అణచడానికి ఈ సూచనలని బహుజన సమాజ్ పార్టీ తెలియజేస్తుందని ఇకనైనా ప్రభుత్వాలు స్పం దించి దళిత క్రైస్తవుల్ని ఎస్సీ జాబితాలో చేర్చాలన్నారు.